# మామూలు మనిషి

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

**మనిషి పూర్తిగా దుర్మార్గుడో, లేక పూర్తిగా సన్మార్గుడో కాదు. రాత్రి, పగలు లాగా అదీ యిదీ వుండటమే మామూలు మనిషికి లక్షణం!**

**ప్రేమ ఫలిస్తే అది జ్యోతిఅయి జీవితానికి వెలుగువిస్తుంది. విఫలమయితే అగ్నిగా మారి జీవితాన్నే కాల్చేస్తుంది. ఇది అందరి ప్రేమికుల విషయంలో జరగకపోయినా, సున్నిత మనస్కులైన బదరిలాంటి వాళ్ళ విషయంలో సంభవిస్తుంది.**

ఆరేళ్ళ గడిచినా బదరి ఇంకా సుకన్యని మరచిపోలేదు. వారంలో నాలుగైదుసార్లు ఏదో విధంగా ఆమె గుర్తుకువస్తూనే వుంది. ఆమె గుర్తుకు వచ్చినప్పుడల్లా బదరి మనసులో ఏదో వెలితి, బాధ— ముఖ్యంగా తన కొడుకుని చూసినప్పుడల్లా. దానికొక కారణం వుంది.

"సారీ బదరి, నాన్నగారి మాట కాదనలేను. పైగా నా చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకి మన వివాహం అడ్డొస్తుంది. ఇదంతా ముందే ఆలోచించక పోవటం నా తప్పే." చెప్పింది సుకన్య ఆరేళ్ళ క్రితం ఓ రోజు.

"అంటే....?" అడిగాడు బదరి.

"మన పెళ్ళి జరగడం లేదు."

"డామిట్. మరా సంగతి రేపు పెళ్ళనగా ఇవాళ చెప్తే ఎలా? అందరికీ వెడ్డింగ్ కార్డ్స్ నువ్వే పోస్ట్‌చేశావుగా. ఆఫీసులో అందరికీ చెప్పేశాను. రేపు సాయంత్రం డిన్నర్‌కి వస్తారు వాళ్ళంతా. సాక్షి సంతకాలకి మా అన్నయ్య, నా స్నేహితుడు యిద్దరు కొలీగ్స్ వస్తున్నారు."

బదరి మొహం కోపంతో ఎర్రబడింది.

"నిజమే. రిజిస్ట్రార్ ఆఫీస్‌లో నెలక్రితం మనం వివాహానికి అప్లికేషన్ పెట్టినప్పుడు మా నాన్నతో ఆ సంగతి చెప్పివుండాల్సింది. చెప్పలేదు. నిన్న చెప్తే యెంతమాత్రం అంగీకరించలేదు. మా చెల్లెళ్ళు అసలే ఒప్పుకోలేరు."

"మనిద్దరి సమ్మతి అవసరం. కాని వాళ్ళ అంగీకారం కాదు ముఖ్యం."

"మా కుటుంబం గురించి అర్థంచేసుకో బదరీ. ఈ వివాహంవల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయి. మా నాన్న బతికుండగా నా చెల్లెళ్ళకి ఇక వివాహం చేయలేరు. వాళ్ళని చేసుకోడానికి ఎవరూ ముందుకు రారు మన వివాహం జరిగితే."

బదరి విసుగ్గా అడిగాడు. "రేపు మన రిజిస్టర్ మేరేజ్ జరగదంటావా అయితే?"

"ఉహూ. ఐయామ్ సో సారీ."

బదరీ కోపంతో కాసేపు మాట్లాడలేక పోయాడు.

"సుకన్యా ఈ సంగతి రేపు పదిమందికీ తెలిస్తే నిన్ను ఎవరు పెళ్ళి చేసుకుంటారు? నీసంగతి ఆలోచించు ముందు."

"అన్నీ ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. ప్లీజ్ నన్నర్థం చేసుకుని నామాట విను."

"రేపు ఉదయం పదకొండింటికి మన వివాహం జరుగుతుంది. అర్థమైందా?" సుకన్య భుజాలు పట్టుకుని గట్టిగా వూపుతూ అరిచాడు బదరి.

"నెవర్."

సుకన్య వెళ్ళిన అరగంటదాకా బదరి తేరుకోలేకపోయాడు. మనసు అవమానంతో బాధతో కుతకుతలాడిపోయింది. సుకన్య ఎంత గుండెలు తీసిన బంటు? ఎంత కృతఘ్నురాలు?

మర్నాడు చాలామందికి ఫోన్ చేసి చెప్పాడు ఆ రోజు డిన్నర్ కేన్సిల్ అయిందని.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగిన వాళ్ళందరికీ అసలు కారణం చెప్పాడు.

"సుకన్య వద్దందా? ఎందుకు?"

శెలవు కేన్సిల్ చేసుకుని ఆఫీస్‌కి వచ్చి చెప్పాడు బదరి తన వివాహం రద్దయిందని. కొందరు తోటి ఉద్యోగులు తమకు తాము గుసగుసలాడుకున్నారు. అలా జరుగుతుందని బదరికి తెలుసు. డిన్నర్ ఏర్పాటు చేసిన హోటల్‌కి ఫోన్ చేసి కేన్సిల్ చేసేశాడు.

కేన్సిల్. కేన్సిల్. కేన్సిల్. ఆ రోజు అంతా కేన్సిల్సే. నెలతిరక్కుండానే సుకన్య వివాహం జరిగిపోయింది మరొకరితో—

పెళ్ళి పందిట్లో వాళ్ళ నాన్నగారి చేతుల మీదుగా.

రిజిస్ట్రార్ ఆఫీస్‌లో కాదు.

మరోసారి బదరి కొలీగ్స్ గుసగుసలాడుకున్నారు.

అలాంటి పరిస్థితిల్లో చాలామంది మగాళ్ళు చేసేపనే చేశాడు బదరి. ప్రయివేట్ కంపెనీ కాబట్టి తన వుద్యోగానికి రిజైన్ చేసి, అనకాపల్లినించి హైదరాబాద్‌కి

**మామూలు మనిషి ఒకటి——**

మకాం మార్చాడు. సికింద్రాబాద్‌లోని మరో ప్రయివేట్ కంపెనీలో వుద్యోగం దొరికింది.

కొన్ని నెలలదాకా బదరికి సుకన్య చేసిన అవమానం-దాన్నతనుఅవమానంగా భావించాడు- బాధిస్తూనే వుంది. అది మర్చిపోవాలంటే తనూ వివాహం చేసుకోవటం ఉత్తమం అనిపించింది.

సుకన్యకి వివాహం అయిన పదకొండు నెలల తర్వాత బదరికి వివాహం అయిపోయింది శ్రీలక్ష్మితో.

వివాహం అయిన రెండు నెలలకి అతనికి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ప్రమోషన్ కూడా వచ్చింది.

"నువు నిజంగా శ్రీలక్ష్మివే." చెప్పాడు ఆనందంగా.

కాలం గడుస్తున్నకొద్దీ సుకన్యమీద

కోపం తగ్గలేదు. బాధ తీవ్రత కొద్దికొద్దిగా తగ్గిపోతున్నా. తన ఆఫీస్ గదిలో బల్ల మీద వున్న అద్దంకింద ఓ కోతి బొమ్మని వుంచాడు. దానిమీద "సుకన్య అంటే నాకు పరమ ద్వేషం" అని రాశాడు. ' ఆ విధంగా ఆ అమ్మాయిమీదవున్న కోపానికి మెటీరియల్ రూపం ఇచ్చాడు బదరి.

సుకన్య హైద్రాబాద్‌లోనే వుందని, ఎక్కడో ఉద్యోగం చేస్తోందనీ బదరీకి తెలిసింది. కాని ఆమె యెక్కడా తారస పడలేదు.

ఆరేళ్ళ తర్వాత ఓ రోజు సుకన్య బదరీకి కనిపించింది, నాగార్జున సాగర్ వెళ్ళే టూరిస్ట్ బస్‌లో—సేల్స్ సెక్షన్‌లో పనిచేసే చక్రధరరావు భార్యగా.

ఆఫీసు రిక్రియేషన్ క్లబ్ ఏర్పాటు చేసిన ఆ పిక్నిక్‌కి ఆఫీసులోని ఉద్యోగులు తమ భార్యలతో వచ్చారు.

* * *

"ఎలా వున్నారు ?" సుకన్యే పలకరించింది బదరీని మ్యూజియంలో.

"దర్జాగా." జవాబిచ్చాడు బదరి.

"నాలాగేనన్నమాట." నవ్వింది.

"చక్రధరరావు భార్యవన్నమాట."

"అవును. అంతేకాదు మన సంగతి ఆయనకి ముందే తెలుసు."

"బ్లాక్ మెయిల్ చేస్తానని భయమా?"

"లేదు. నీ భార్య నాకన్నా అందంగా వుంది. అదృష్టవంతుడివే."

"అఫ్‌కోర్స్."

"ఎంతమంది పిల్లలు?" అడిగింది.

"ఇద్దరు. కొడుకు, కూతురు."

"నాకూ ఇద్దరే. కొడుకు, కూతురు" చెప్పింది సుకన్య.

"నువ్వంటే అసహ్యం నాకు."

నవ్వింది.

"నీ మనసులోనిభావం నీకే తెలియదా ? అసహ్యం కాదది కోపం. నేనంటే నీకెంతో కోపం."

"కోపం, అసహ్యం కూడా."


"అయితే ఆ కోతిబొమ్మమీద "నాకు సుకన్యంటే పరమ అసహ్యం" అనికూడా రాయి" మరోసారి నవ్వింది.

పిక్నిక్‌నించి తిరిగి హైద్రాబాద్ వచ్చాక సుకన్యకి చెప్పాడు చక్రధరరావు ఓ రోజు.

"బదరీ ఆ బొమ్మమీద నువ్వంటే అసహ్యం అనికూడా రాశాడు కొత్తగా."

"నా సలహాలు పాటించే అలవాటు ఇంకా పోయినట్టులేదు" అన్నది సుకన్య.

బదరీలో కొత్త ఆలోచనలుచోటుచేసుకో సాగాయి. ఎలాగైనా తను సుకన్యమీద పగ తీర్చుకోవాలి. తనని అవమానపరిచినందుకు బదులుతీర్చుకోవాలి. దెబ్బకొట్టాలి. బదరి దేముడుకాదు క్షమించి మర్చిపోడానికి— మామూలు మనిషి. ఎలా?



బదరీలో ఆ "ఎలా" అనే ఆలోచన అధికంగా చోటుచేసుకోసాగింది. చక్రధరరావుని డిస్‌మిస్ చేస్తే ఏదైనా నెపంతో ?

అందుకతని మనసు అంగీకరించలేదు ఎంత మాత్రం.

రోజూ ఆఫీస్‌నించి ఇంటికి వెళ్ళాక తన కొడుకుని చూసినప్పుడల్లా సుకన్యమీద ద్వేషం అధికం కాసాగింది.

బదరి కొడుకు కుడికాలికి పోలియోవ్యాధి సోకటంతో ఆ కాలు సన్నబడి పూర్తిగా

చచ్చుబడిపోయింది. నేలమీద పాకుతాడు. నడవలేడు.

సుకన్య ఆ రోజున తనని నిరాకరించకుండా వివాహం చేసుకునివుంటే, తమకి ఆరోగ్యవంతమైన కొడుకు కలిగి వుండేవాడేమో? పెద్దవాడయ్యాక వాడి భవిష్యత్తు ఏమవుతుంది? బదరి జీవితంలో అతని కొడుకు బాధాకరమయిన భాగం.

సుకన్య డిఫెన్స్ ఎకౌంట్స్‌లో క్లర్క్‌గా పనిచేస్తోందని తెలిసింది బదరికి.

తెలియగానే వచ్చింది ఆ ఆలోచన. మెరుపులా తట్టిందా ఆలోచన. తన చేతుల్లోనే వుంది. చక్రధరరావుని వరంగల్‌లోని బ్రాంచికి బదిలీ చేస్తే? సుకన్య తన ఉద్యోగం దృష్ట్యా వరంగల్‌కి భర్తతో పాటు వెళ్ళలేదు. కొద్దికాలం ఏడిపించి మళ్ళీ ఏ రెండు సంవత్సరాల తర్వాతో తిరిగి సికింద్రాబాద్‌కి బదిలీ చెయ్యొచ్చు. సుకన్య తప్పకుండా తనని అడుగుతుంది బదిలీ ఆపమని. అప్పుడు చెప్పచ్చు తనెందుకు ఆపని చేశాడో! పగ— కోపం.

వరంగల్‌కా?

ఊహు.

ప్రతీ ఆదివారం చక్రధరరావు సికింద్రాబాద్‌కి వచ్చే అవకాశం వుంటుంది అంత దగ్గిరలో అయితే.

శ్రీకాకుళానికి బదిలీ చేస్తే నెలకోసారి కూడా రావటం కష్టం అవుతుంది. ప్రతీ రెండో శనివారం, ఆదివారం సుకన్యే వెళ్తుంది బహుశ.

వారంరోజుల్లో అన్ని యేర్పాట్లు చేసేశాడు బదరి. ఫోన్‌లో శ్రీకాకుళం బ్రాంచి మేనేజర్‌తో మాట్లాడాడు. అక్కడున్న టైపిస్ట్‌ని విశాఖపట్నానికి, విశాఖపట్నంలోని టైపిస్ట్‌ని సికింద్రాబాద్‌కి. చక్రధరరావుని శ్రీకాకుళానికి బదిలీ చేసే ఆర్డర్లు చక్రధరరావే టైప్ చేశాడు.

సంతకంచేసి వాటిని ఇష్యూ చేశాడు బదరి. బదరి ఎదురు చూసినట్లుగా సుకన్య వచ్చి ఆ బదిలీని ఆపమని కోరలేదు. చక్రధరరావు శ్రీకాకుళం వెళ్ళిపోయాడు. బదరి ఇగో దెబ్బతిని సుకన్యమీద కోపం ఇంకాస్త అధికం అయింది—ఆమె తనని ప్రాధేయపడకపోవడంతో.

రెండు నెలలు గడిచాయి.

ఓ ఆదివారం.

* * *

బదరి తన భార్య శ్రీలక్ష్మివైపు బంధువుల ఇంటికి ఓ ఆదివారం భోజనానికి వెళ్ళాడు—వాళ్ళింట్లో సత్యనారాయణవ్రతం జరుపుకుంటే.

ఆ వ్రతానికి సుకన్య కూడా వస్తుందని బదరి అనుకోలేదు. పక్కల్లే కాబట్టి శ్రీలక్ష్మి బంధువులు ఆమెని కూడా భోజనానికి పిలిచారు.

"ఎలా వున్నావ్?" ప్రశ్నించింది చిరునవ్వుతో.

"నువ్వు" అడిగాడు బదరి.

"ఎప్పటిలానే, అంటే దర్జాగా"

"వెరీగుడ్. వెరీగుడ్-" కొద్దిగా వెటకారం ధ్వనించింది అతని కంఠంలో.

చక్రధరరావు ప్రసక్తి వాళ్ళిద్దరిమధ్య రానేలేదు.

"మీ పిల్లల్ని తీసుకురాలేదే?" అడిగింది సుకన్య.

"ఊరికే, నీ పిల్లలు?"

"రానన్నారు. ఆడుకుంటున్నారు. భోజనం తీసుకెళ్ళి యింట్లోనే పెడతాను వాళ్ళకి."

"మీ యింటికి పిలవ్వా?" అడిగాడు బదరి నవ్వుతూ.

"ఊహు" తల అడ్డంగా వూపింది.

"మంచిది. మర్యాద తెలీదన్నమాట నీకు."

"తెలీదు."

"లేక నేనంటే కోపమా?"

"ఎందుకు కోపం?" అడిగింది.

ఆ ప్రశ్నకి సమాధానంవున్నా జవాబు చెప్పలేదు బదరి.

ఆ రాత్రి మాటల్లో శ్రీలక్ష్మి చెప్పింది బదరికి—ఇంటికి తిరిగి వచ్చాక.

"సుకన్య తెలుసుగా మీకు?

"తెలుసు."

"వాళ్ళాయన మీ ఆఫీస్‌లో పనిచేస్తున్నాడు కదా?"

"అవును."

"పాపం."

"శ్రీకాకుళానికి బదిలీ అయిందనా?"

"కాదు."

"మరింక దేనికి పాపం?"

"సుకన్యకి యిద్దరు పిల్లలు.

"అవును—అయితే?"

"పెద్దమ్మాయి కుడికాలికి పోలియో. పెద్దయ్యాక ఆ అమ్మాయికి పెళ్ళెలా చేస్తారో. కొడుక్కి పోలియోవస్తే తల్లడిల్లిపోతున్నాం. వాళ్ళింట్లో ఆ అమ్మాయికి వచ్చింది పాపం."

"అరెరె పాపం" బదరి కంఠంలో బాధ ధ్వనించింది. సంతానంలో ఎవరికయినా పోలియో వస్తే తలితండ్రులు పడే ఆవేదన అర్థం చేసుకోగలడు బదరి, అది అతనికి స్వానుభవమే కాబట్టి.

"అంతేకాదు. కొడుక్కి మాటలు రావు. మూగవాడు" ఇద్దరికీ రెండురకాల ఇబ్బంది పెట్టాడా దేముడు."

"పూర్ ఫెలో." జాలిగా అన్నాడు బదరి.

* * *

వారం తర్వాత చక్రధరరావుకి శ్రీకాకుళం నించి సికింద్రాబాద్‌కి బదిలీ అయింది.

బదరి దేముడు ఎలాకాడో, రాక్షసుడు కూడా అలాగే కాడు. మామూలు మనిషి.

అతనిలో సుకన్యమీదగల కోపాన్ని, ద్వేషాన్ని కొత్తగా ఆమె మీద కలిగిన సానుభూతి, జాలి పూర్తిగా మాయం చేశాయి.

బదరి మామూలు మనిషి కాబట్టే అతనిలో ద్వేషం రగిలింది. ప్రతీకారవాంఛ తలెత్తింది.

మామూలు మనిషే కాబట్టి ఆ స్థానంలో దయ, కరుణ చోటు చేసుకున్నాయి.

చక్రధరరావుకి రెండు స్పెషల్ ఇంక్రిమెంట్లకి రికమెండ్ చేయకుండా వుండలేకపోయాడా మామూలు మనిషి. ●

